## సోషల్ మీడియా ప్రచారాలపై ప్రత్యేక నజర్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



ఎంసీఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 8 : ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, ప్రకటనలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. అందుకు ట్రాకింగ్ ద్వారా వాటి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు దిన పత్రికలు, చానల్స్‌లో వార్తలు, ఆర్టికల్స్ ఉండాలన్నారు. వాటిపై నిరంతరం పరిశీలన చేసి అనుమానిత ఆర్టికల్స్, పెయిడ్ న్యూస్‌పై ఆయా నియోజక వర్గాల ఆర్వోలకు నివేదిక రూపంలో అందించడం జరుగుతుందన్నారు. వాటిపై చర్యల కోసం వ్యయ పరిశీలకులకు పంపించాలన్నారు. సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రం ద్వారా ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా కట్టడికి నోడల్ అధికారితో పాటు కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీపీఆర్‌ఓ రమేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం చెల్లెను చంపిన అన్న

- కేసు చేధించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాహుల్ హెగ్డే



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట సిటీ, నవంబర్ 8 : ప్లాటు కాగితాలు, బంగారం కోసం చెల్లిని హత్య చేసి కరెంట్ ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన అన్నను సూర్యాపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసు వివరాలను వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలం అనాజిపురం గ్రామానికి చెందిన అనుములపురి రాజ్‌కుమార్ తన చెల్లి, సూర్యాపేట పట్టణానికి చెందిన అనుములపురి స్వరూపారాణి వద్ద తన తండ్రి పేర ఉన్న 300 గజాల ప్లాటు కాగితాలు పెట్టి రూ.50 వేలు తీసుకున్నాడు. పైసలు కడుతాను ప్లాట్ కాగితాలు తిరిగి ఇవ్వమని ఆరు నెలలుగా అడుగుతున్నా ఇవ్వడం లేదు. నాన్న సంపాదించిన ఆస్తిపై తనకు వాటా ఉన్నదని, డబ్బులకు వడ్డీ లెక్క కడితే నీ వాటా ప్లాట్‌కు సరిపోయాయని ఇక నీకు ప్లాట్ ఎక్కడిదని ప్రశ్నిస్తున్నది. దాంతో కోపం పెంచుకున్న రాజ్‌కుమార్ ఈ నెల 5న సాయంత్రం సూర్యాపేట సీతారాంపురంలోని చెల్లి ఇంటికి వెళ్లి ఆమె ఒంటరిగా ఉన్న సమయం చూసి ఇనుప బద్దెతో తలపై విచక్షణారహితంగా కొట్టి చంపాడు. ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడు తీసుకుని కరెంట్ ప్రమాదంలో చనిపోయిందని నమ్మించే యత్నంలో అక్కడ ఉన్న వస్తాలకు నిప్పంటించి ఆమె మొఖంపై వేసి అక్కడి నుంచి పారిపోయాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి కేసు మిస్టరీని చేధించారు. కేసును చేధించడంలో చాకచక్యం ప్రదర్శించిన సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ జి.రాజశేఖర్, ఎస్‌ఐ.మహేంద్రనాథ్, హెడ్ కానిస్టేబుల్ కరుణాకర్, కృష్ణ, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, సైదులు, మధును ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

### మా మద్దతు మంత్రి జగదీశ్‌రెడ్డికే

- కుడకుడలో గౌడ్ల ఏకగ్రీవ తీర్మానం

చివ్వెంల, నవంబర్ 8 : తమ సంపూర్ణ మద్దతు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికే అని కుడకుడ గౌడ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. సూర్యాపేట అభివృద్ధికి బాటలు వేసిన మంత్రి వెంటే తామంతా ఉంటామని స్పష్టం చేశారు. జిల్లా నాయకుడు గుర్రం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరారు.

### నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొడ్రాయిబజార్, నవంబర్ 8 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో సూర్యాపేట పరిధిలోని మెస్సర్స్ మంజిత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ బాలెంల కాటన్ మిల్లులో సీసీఐ చే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం.డి.ఫసియొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పత్తిని తీసుకొస్తే ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 పొందవచ్చని పేర్కొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఏఓ రామారావునాయక్

ఆత్మకూర్.ఎస్, నవంబర్ 8 : మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్ అన్నారు. బుధవారం ఆత్మకూర్.ఎస్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులంతా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఓ దివ్య, ఏఈఓ శైలజ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

# తెలంగాణను దోపిడీదారుల పాలు చేయొద్దు

- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



చివ్వెంల : సూర్యాపేట పట్టణం 4వ వార్డు కాసీంపేటలో ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

చివ్వెంల, నవంబర్ 8 : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దోపిడీదారుల పాలు చేయొద్దని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి కాసింపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేండ్ల కాలంలోనే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్‌తో పాటు సాగునీళ్ల కోసం వేల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తొలి ఫలితం అందుకున్నది సూర్యాపేట జిల్లా వాసులేనన్నారు. తమ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ఇంటింటికీ సన్న బియ్యం, నిరుపేదలకు రూ.400 కే గ్యాస్ సిలిండర్, రైతు బంధు రూ.16 వేలకు పెంపు, రైతు బీమా తరహాలో కేసీఆర్ బీమా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాటోతు లక్ష్మీమకటలాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

సూర్యాపేట రూరల్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ జిడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేటను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి జగదీశ్‌రెడ్డికే దక్కుతుందని, అభివృద్ధి చేసి చూపించిన వ్యక్తికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల మల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌని లక్ష్మణుడు పాల్గొన్నారు.

### సంక్షేమ సారథినే మళ్లీ గెలిపించాలి..

బొడ్రాయిబజార్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రదాత, సంక్షేమ సారథి మంత్రి జగదీశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీనియర్ న్యాయవాదులు గొండ్రాల అశోక్, నల్లకుంట్ల అయోధ్య ప్రజలను కోరారు. పలువురు న్యాయవాదులతో కలిసి పట్టణంలోని 43వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గతంలో ఉన్న దుస్థితిని, ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని, రేపు జరుగబోయే అభివృద్ధిని ప్రజలంతా దృష్టిలో ఉంచుకుని మంత్రిని మరోమారు భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మోదుగు వెంకట్‌రెడ్డి, తలమల్ల హుసేన్, రేగట్టె లింగయ్య, దొంత నారాయణ, తొగిలి మురళి, లతీఫ్ అహ్మద్, పిట్టల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి సత్యనారాయణ, చిప్పలపల్లి చిరంజీవి పాల్గొన్నారు.



సూర్యాపేట రూరల్ : రామన్నగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



బొడ్రాయిబజార్ : కారు గుర్తుకు ఓటు వేయాలని 43వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

## ఐదో రోజు 24 నామినేషన్లు

- కోదాడలో నామినేషన్ వేసిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

సూర్యాపేట, నవంబర్ 8 : జిల్లాలో ఐదో రోజు నామినేషన్ల జోరు కొనసాగింది. బుధవారం జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో 23 మంది అభ్యర్థులు 24 నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 36 మంది అభ్యర్థులు 63 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ నామినేషన్ వేశారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో ముగ్గురు అభ్యర్థులు మూడు సెట్ల నామినేషన్లు వేశారు. మరో ముగ్గురు అదనపు సెట్ నామినేషన్ వేశారు. అరిపెండ్ల జ్యోతి (డీఎస్పీ), పిల్లలమర్రి లావణ్య(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), చల్ల శ్రీలతారెడ్డి (బీజేపీ)తరుపున నామినేషన్ వేయడం జరిగింది. గంగిరెడ్డి కోటిరెడ్డి (స్వతంత్ర), ఉపేందర్ తండు (స్వతంత్ర), జాజుల శ్రీకాంత్ (స్వతంత్ర) మరో సెట్ నామినేషన్ వేశారు. సూర్యాపేట నియోజక వర్గంలో ఐదో రోజు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వట్టే జానయ్య (బీఎస్పీ), బంగారు నాగరాజు (కార్మిక యువ చైతన్య సమితి), ఆరూరి వెంకటేశ్వర్లు (స్వతంత్ర), వరికుప్పల వెంకన్న (ఎంసీపీఐ.యు), చెరుకు కిరణ్‌కుమార్ (డీఎస్పీ), మారం వెంకట్‌రెడ్డి(స్వతంత్ర), మచ్చ వీరకుమారి (డీఎస్పీ) తరుపున నామినేషన్లు వేసినట్లు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి వీరబ్రహ్మచారి తెలిపారు. కోదాడ నియోజక వర్గంలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వారిలో బొల్లం మల్లయ్యయాదవ్ (బీఆర్ఎస్) రెండు నామినేషన్ సెట్లు వేయగా, పిలుట్ల శ్రీనివాస్ (బీఎస్పీ), షేక్ మస్తాన్ సాబ్ (స్వతంత్ర), సంపంగి అఖిల (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), కొల్లు లక్ష్మీనారాయణ (స్వతంత్ర), చక్రాల లింగయ్య (స్వతంత్ర), పచ్చిపాల రామకృష్ణయాదవ్ (స్వతంత్ర) నామినేషన్ వేయడం జరిగింది. తుంగతుర్తి నియోజక వర్గంలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వారిలో జోహార్ కొమ్ము (స్వతంత్ర), బైగారి అనంతయ్య (యువ తులసి పార్టీ), కొంగరి మల్లయ్య (స్వతంత్ర)నామినేషన్ దాఖలు చేశారు.

## నామినేషన్ల దాఖలుకు రేపు ఆఖరు

- నేడు నామినేషన్ వేయనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 8 : తెలంగాణ శాసన సభ ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల పర్వం చివరి దశకు చేరుకున్నది. శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు. బుధవారంతో ఐదు రోజుల గడువు ముగియగా గురు, శుక్రవారాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నామినేషన్ వేస్తుండగా, కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి సైతం నామినేషన్ వేయనున్నారు. ఐదో రోజు సూర్యాపేట నియోజక వర్గంలో ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా ఇప్పటి వరకు 15 మంది 21 సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఎన్నికల సంఘం ఈ నెల 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయగా 10వ తేదీ వరకు నామినేషన్లకు గడువు విధించింది. దాంతో సూర్యాపేట శాసన సభ స్థానానికి తొలి రోజు నుంచే అభ్యర్థులు నామినేషన్లు వేయడం ప్రారంభించారు. 3 నుంచి 8వ తేదీ వరకు 15 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఐదు రోజుల్లో బీఎస్పీ అభ్యర్థి మినహా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవ్వరూ నామినేషన్ వేయలేదు. గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉన్నది. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు. స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీగా బయల్దేరి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం పోటీ పడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి సైతం గురువారం నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించారు. ఇరువురూ వేర్వేరుగా నామినేషన్ వేస్తుండడంతో కాంగ్రెస్‌కు రెబల్ బెడద తప్పేట్లు లేదు. బీజేపీ అభ్యర్థి చివరి రోజు నామినేషన్ వేయనున్నారు.

### బీఎస్పీ చివ్వెంల మండలాధ్యక్షుడి రాజీనామా

చివ్వెంల, నవంబర్ 8 : బీఎస్పీకి ఆ పార్టీ చివ్వెంల మండలాధ్యక్షుడు మధుసూదన్ రాజీనామా చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బహుజన వాదానికి పూర్తి భిన్నంగా బీఎస్పీ నాయకుల ప్రవర్తన ఉన్నట్లు తెలిపారు. పార్టీలో ఇటీవల చేరిన నాయకుల తీరు, ప్రవర్తన నచ్చకనే బీఎస్పీ ప్రాథమిక సభ్యత్వానికి, మండలాధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. బహుజన వాదం పేరు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్న వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.